VC NEWS

# వేగుచుక్క

పీడిత ప్రజల గొంతుక...

TELUGU DAILY NEWS

www.veguchukkanews.com

శనివారం 23 మార్చి 2024

సంపుటి.01 సంచిక.224

# కేజ్రీవాల్ అరెస్ట్‌తో ఆప్‌ను నడిపేదెవరు?

## పార్టీలో ప్రధాన చర్చగా ఢిల్లీ పీఠం..



అవినీతి మరక అంటితే సిఎం అయినా లెక్కలేదు

గతంలో తమిళనాడు సిఎంగా జయలలితపై అవినీతి కేసు

జార్ఖండ్ సిఎం హేమంత్ సోరేన్‌కు అదేగతి

ఢిల్లీ లిక్కర్ స్కామ్ కేసులో కింగ్‌పిన్ కేజ్రీవాల్

ఇది ఓ వందకోట్ల వ్యవహారం మాత్రమే కాదు

ఇందులో 600కోట్ల వరకు చేతులు మారాయి

ప్రధాన సూత్రధారి కేజ్రీవాల్ మాత్రమే

కవితతో నేరుగా మాట్లాడినట్టు

ఇడి అధికారుల వెల్లడి

కేజ్రీవాల్‌ను కోర్టులో ప్రవేశ పెట్టిన ఇడి

2లో..

# సుప్రీంకోర్టులో ఎమ్మెల్సీ కవితకు ఎదురుదెబ్బ

### బెయిల్ కోసం ట్రయల్ కోర్టుకు వెళ్లాలని సూచన



**న్యూఢిల్లీ:** సుప్రీంకోర్టులో ఎమ్మెల్సీ కవితకు ఎదురుదెబ్బ తగిలింది. బెయిల్ కోసం ట్రయల్ కోర్టునే ఆశ్రయించాలని సుప్రీం ధర్మాసనం సూచించింది. తన అరెస్ట్ చట్టవిరుద్ధమంటూ కవిత దాఖలు చేసిన పిటిషన్‌పై సుప్రీం ధర్మాసనం విచారణ నిర్వహించింది. రాజ్యాంగ ఉల్లంఘనలకు సంబంధించి కవిత లేవనెత్తిన అంశాలను గతంలో విజయ్ మదన్ లాల్ కేసుకు సుప్రీం ధర్మాసనం జత చేసింది. రాజ్యాంగ ఉల్లంఘనలకు సంబంధించిన అంశాలను మాత్రమే విచారణ జరుపుతామని ధర్మాసనం స్పష్టం చేసింది. ప్రతివాదులకు నోటీసులు జారీ చేసింది. బెయిల్ తాము ఇవ్వలేమని, ఎవరైనా కింది కోర్టును మొదట ఆశ్రయించాల్సిందేనని సుప్రీం ధర్మాసనం స్పష్టం చేసింది. ప్రతివాదులకు నోటీసులు జారీ చేసింది. 6 వారాల్లోగా కౌంటర్ అఫిడవిట్లు దాఖలు చేయాలని ఆదేశించింది. బెయిల్ కోసం ట్రయల్ కోర్టుకు వెళ్లాలని పిటిషనర్‌కు సూచించింది. బెయిల్ తాము ఇవ్వలేమని, ఎవరైనా కింది కోర్టును మొదట ఆశ్రయించాల్సిందేనని సుప్రీం ధర్మాసనం స్పష్టం చేసింది. కవిత కేసు జస్టిస్ సంజీవ్ ఖన్నా నేతృత్వంలోని ధర్మాసనం ముందు విచారణ జరిగింది. కవిత తరపున కపిల్ సిబల్ (ఐజూతి ఃూతిశిజీ) వాదనలు వినిపించారు. కాగా.. ఈడీ అరెస్టును సవాల్ చేస్తూ కవిత పిటిషన్ దాఖలు చేశారు. క్రిమినల్ ప్రొసీడింగ్స్ క్వాష్ చేయాలని కోరుతూ పిటిషన్ దాఖలైంది. ఇప్పటికే ఢిల్లీ లిక్కర్ స్కామ్ కేసులో ఈడీ అరెస్ట్‌ను సవాల్ చేస్తూ ఎమ్మెల్సీ కవిత సుప్రీంకోర్టులో దాఖలు చేసిన పిటిషన్‌పై ఇవాళ విచారణ జరిగింది. ఇదే కేసులో ఢిల్లీ సీఎం అరవింద్ కేజీవ్రాల్‌ను సైతం ఈడీ అరెస్టు చేసింది. కేజీవ్రాల్ అరెస్ట్ పై అత్యవసర విచారణకి సుప్రీంకోర్టు అంగీకరించింది.

### కాంగ్రెస్‌లోకి జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల విజయలక్ష్మి!



హైదరాబాద్: భారాస నేత, రాజ్యసభ సభ్యుడు కె.కేశవరావును కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జి దీపాదాస్ మున్షి కలిశారు. బంజారాహిల్స్‌లోని కేకే నివాసానికి ఆమెతో పాటు ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, ఖైరతాబాద్ డీసీసీ అధ్యక్షుడు రోహిన్‌రెడ్డి వెళ్లారు. దాదాపు 40 నిమిషాల పాటు జరిగిన రాజకీయ చర్చల్లో జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల విజయలక్ష్మి కూడా పాల్గొన్నారు. లోక్‌సభ ఎన్నికల అభ్యర్థుల ఎంపికపై తీవ్ర కసరత్తు సాగుతోన్న సమయంలో కేకేను కాంగ్రెస్ నేతలు కలవడం రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. వీరిద్దరూ పార్టీ మారే అవకాశాలు ఉన్నట్టు ప్రచారంజరుగుతోంది.



2లో

## కాంగ్రెస్,బిజెపిలకు దిక్కులేదు

మా అభ్యర్థులకు వలవేసి టిక్కెట్లు

రైతులను ఆదుకోవడంలో కాంగ్రెస్ విఫలం

జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర రెడ్డి



2లో

## ఎన్నికల నేపథ్యంలో ఎంట్రెన్స్ పరీక్షల్లో మార్పులు

మే 7, 8వ తేదీల్లో అగ్రికల్చర్, ఫార్మా పరీక్షలు

మే 9,10,11వ తేదీల్లో ఇంజనీరింగ్ విభాగం పరీక్షలు

జూన్ 5, 6వ తేదీల్లో ఐసెట్ పరీక్ష

## కేజ్రీవాల్ అరెస్ట్..

### దేశ ప్రజాస్వామ్య చరిత్రలో మరో చీకటి రోజు



హైదరాబాద్: ఆమ్ ఆద్మీ పార్టీ అధినేత, ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ అరెస్టు దేశ ప్రజాస్వామిక చరిత్రలో మరో చీకటి రోజు అని బీఆర్ఎస్ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు వ్యాఖ్యానించారు. కేజ్రీవాల్ అరెస్టును ఖండిస్తూ శు క్రవారం కేసీఆర్ ఒక ప్రకటన విడుదల చేశారు. 'ప్రతిపక్షాన్ని నామరూపాలు లేకుండా చేయాలనే ఏకైక సంకల్పంతో కేంద్రంలోని అధికార బీజేపీ వ్యవహరిస్తోంది. ఇటీవలి కాలంలో జరిగిన జార?ండ్ ముఖమంత్రి హేమంత్ సోరెన్, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత అరెస్టు ఘటనలు దీన్ని రుజువు చేస్తున్నాయి. ప్రతిపక్ష నేతల అరెస్టు కోసం ఈడీ, సీబీఐ, ఐటీ తదితర కేంద్ర దర్యాప్తు సంస్థలను కేంద్ర ప్రభుత్వం పావులుగా వాడుకుంటోంది. ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టులా పరిణమిస్తున్న బీజేపీ ప్రభుత్వ చర్యలను బీఆర్ఎస్ తీవ్రంగా ఖండిస్తోంది. కేజ్రీవాల్ అరెస్టు రాజకీయ ప్రేరేపితమైంది. అక్రమ కేసులను వెనక్కి తీసుకొని, అరెస్ట్ చేసిన వారిని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తున్నాం' అని ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

# కాంగ్రెస్,బిజెపిలకు దిక్కులేదు

**హైదరాబాద్:** కాంగ్రెస్, బిజెపిలకు దిక్కులేక బిఆర్ఎస్ నేతలను రప్పించి టిక్కెట్లు ఇస్తున్నారని, బీఆర్ఎస్ నుంచి వేరే పార్టీలోకి వెళ్లేవారిని వదిలిపెట్టేది లేదని ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి హెచ్చరించారు. పార్టీ మారే నేతలు పదవులకు రాజీనామా చేసి వెళ్లాలని చెప్పారు. పార్టీ మారిన నేతలని ప్రజలు చెప్పులతో కొడతారని వార్నింగ్ ఇచ్చారు. శుక్రవారం నాడు తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. కాంగ్రెస్, బీజేపీకి పార్లమెంట్ ఎన్నికల్లో పోటీ చేయడానికి ఎంపీ అభ్యర్థులు లేక తమ పార్టీ నేతల వెంట పడుతున్నారని మండిపడ్డారు. కొందరు పిరికి పందలు పార్టీ మారుతున్నారని ధ్వజమెత్తారు. స్వలాభం కోసం రాజకీయాలను భ్రష్టు పట్టించిన నేతలు ఒక పార్టీలో గెలిచి మరో పార్టీలోకి వెళ్లడం శోచనీయమని అన్నారు. అక్రమాలు చేసిన వారు పార్టీ మారితే వారి అక్రమాలను బీఆర్ఎస్సే బయట పెడుతుందని హెచ్చరించారు. అకాల వర్షాల వల్ల రాష్ట్రంలో రెండు లక్షల ఎకరాల్లో పంట నష్టం జరిగిందని చెప్పారు. వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు రైతులకు భరోసా కల్పించకుండా గత కేసీఆర్ ప్రభుత్వంపై విమర్శలు చేయడం తగదని అన్నారు. గత ప్రభుత్వంలో అంచనాలు వేసి వెంటనే నష్ట పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. తమ ప్రభుత్వంలో రైతు బంధు నిధులను త్వరగా రైతుల ఖాతాల్లో వేశామని.. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటి వరకు రైతులకు డబ్బులు ఇవ్వలేదని అన్నారు. తాము రైతు బంధు కోసం సిద్ధంగా ఉంచిన నిధులు ఏ కాంట్రాక్టర్‌కు ఇచ్చారో తెలుసునని చెప్పారు. 9 నెలల్లో తాము భక్త రామదాసు ప్రాజెక్ట్ కట్టింది వాస్తవమా కాదా? అని ప్రశ్నించారు. ఎన్నికల్లో రైతులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని కోరారు. వెంటనే రెండు లక్షల రైతు రుణమాఫీ, వరికి రూ. 500 బోనస్ ఇవ్వాలని పల్లా రాజేశ్వర్ రెడ్డి డిమాండ్ చేశారు.

## ఎన్నికల నేపథ్యంలో ఎంట్రెన్స్ పరీక్షల్లో మార్పులు

**హైదరాబాద్:**లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో రాష్ట్రంలో జరగాల్సిన పలు ఎంట్రన్స్ టెస్టుల తేదీల్లో మార్పులు జరిగాయి. తెలంగాణ ఎంసెట్ పరీక్షను షెడ్యూల్ కంటే ముందుగానే నిర్వహించాలని ఉన్నత విద్యామండలి నిర్ణయించింది. అలాగే ఐసెట్ పరీక్షను ఒక్క రోజు పోస్ట్‌పోన్ చేసింది. ముందుగా అనుకున్న షెడ్యూల్ ప్రకారం ఎప్‌సెట్ పరీక్షలు మే 9వ తేదీ నుంచి 12వ తేదీ వరకు జరగాల్సి ఉంది. కానీ తెలంగాణలో లోక్‌సభ ఎన్నికలు మే 13వ తేదీన జరగనున్నాయి. పరీక్షలకు, ఎన్నికల తేదీకి ఒక్క రోజు మాత్రమే గ్యాప్ ఉండటంతో గందరగోళం ఏర్పడే అవకాశం ఉందని భావించిన తెలంగాణ ఉన్నత విద్యామండలి ఎప్ సెట్ తేదీల్లో మార్పులు చేసింది. మే 7, 8వ తేదీల్లో అగ్రికల్చర్, ఫార్మా పరీక్షలు నిర్వహించాలని నిర్ణయించింది. మే 9,10,11వ తేదీల్లో ఇంజనీరింగ్ విభాగం పరీక్షలు నిర్వహించనున్నారు.
ముందుగా నిర్ణయించిన షెడ్యూల్ ప్రకారం జూన్ 4, 5వ తేదీల్లో ఐసెట్ పరీక్షలు జరగాల్సి ఉంది. కానీ జూన్ 4వ తేదీన పార్లమెంటు ఎన్నికల ఫలితాలు విడుదల కానున్నాయి. ఈ నేపథ్యంలో ఒక రోజు ఆలస్యంగా ఐసెట్ పరీక్ష నిర్వహించాలని తెలంగాణ ఉన్నత విద్యామండలి నిర్ణయించింది. దీని ప్రకారం.. జూన్ 5, 6వ తేదీల్లో ఐసెట్ పరీక్ష జరగనుంది.

## మైలవరం దక్కించుకున్న వసంత

**టిడిపి జెండా ఎగరేస్తానని ప్రకటన**

విజయవాడ: టీడీపీ మూడో జాబితా ఇవాళ విడుదలైంది. 11 శాసనసభ స్థానాలతో పాటు 13 ఎంపీ అభ్యర్థులను టీడీపీ ప్రకటించింది. ఎన్టీఆర్ జిల్లా మైలవరం నుంచి ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణ ప్రసాద్ టికెట్ దక్కించుకున్నారు. ఇటీవలే ఆయన వైఎస్సార్‌సీపీ నుంచి టీడీపీలో చేరిన విషయం తెలిసిందే. ఇక టీడీపీ మైలవరం టికెట్ దక్కించుకున్నసందర్భంగా ఆయన సోషల్ మీడియా వేదికగా పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడి కి ధన్యవాదాలు తెలిపారు. 'నాపై నమ్మకం ఉంచి మైలవరం నియోజకవర్గ అసెంబ్లీ సీటు కేటాయించిన తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు గారికి ధన్యవాదాలు. మైలవరం నియోజకవర్గంలో తెలుగుదేశం జెండా ఎగిరెలా నియోజకవర్గం లోని ప్రతిఒక్క నాయకుడిని, కార్యకర్తలను సమన్వయపరుస్తూ నా ప్రయాణం కొనసాగిస్తా అని వసంత కృష్ణ ప్రసాద్ ట్విటర్ వేదికగా చంద్రబాబుకు శుభాకాంక్షలు తెలిపారు. వసంతకు టికెట్ కేటాయించడంపై మైలవరంలో టీడీపీ శ్రేణులు సంబరాల్లో మునిగి తేలుతున్నాయి. వసంత పేరు ప్రకటించడంతో మైలవరం ప్రధాన రహదారి పై, పార్టీ కార్యాలయం వద్ద నాయకులు బాణసంచా కాల్చి సంబరాలు చేసుకున్నారు. వసంత నాయకత్వం వర్ధిల్లాలని నినాదాలు చేశారు. అయితే ఇక్కడి టికెట్‌ను తొలుత మాజీ మంత్రి దేవినేని ఉమ కు కేటాయిస్తారని అంతా భావించారు. వసంత టీడీపీలో చేరే సమయంలో కూడా మైలవరం టికెట్ ఎవరికి కేటాయించినా తాను సహకరిస్తానన్నారు. కానీ అనూహ్యంగా మైలవరం టికెట్ వసంతకే దక్కింది. కాగా.. పొత్తులో భాగంగా టీడీపీ 144 అసెంబ్లీ, 17 పార్లమెంటు స్థానాల్లో పోటీ చేయనున్న విషయం తెలిసిందే. దీనిలో భాగంగా ఇప్పటికే 128 శాసనసభ స్థానాలకు అభ్యర్థులను ప్రకటించింది. ఇవాళ కొత్తగా మరో11 శాసనసభ స్థానాలతో పాటు 13 ఎంపీ అభ్యర్థులను ప్రకటించింది. ఇక కేవలం 5 అసెంబ్లీ, 4 ఎంపీ స్థానాలను మాత్రమే పెండింగ్‌లో ఉంచింది.

## పెనమలూరుపై వీడిన ఉత్కంఠ

**ఎట్టకేలకు బోడే ప్రసాద్‌కు టిక్కెట్**

విజయవాడ:పెనమలూరు సీటుపై ఉత్కంఠ వీడింది. టిడిపి అభ్యర్థిగా బోడే ప్రసాద్ ను టిడిపి అధిష్టానం ఖరారు చేసింది. ఇటీవల విడుదల చేసిన తొలి రెండు జాబితాల్లో బోడే ప్రసాద్‌కు సీటు దక్కకపోవడంతో స్వతంత్రంగా పోటీ చేస్తానని ప్రకటించారు. చంద్రబాబు, లోకేష్ ఫోటోలతో ప్రచారం
కూడా మొదలు పెట్టారు. దీంతో టిడిపి అధిష్టానం దిగిరావాల్సి వచ్చింది. అయినప్పటికీ పెనమలూరు సీటు కోసం అనేక పేర్లు పరిశీలించింది. ఓ దశలో ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్, దేవినేని ఉమా ఇలా రకరాల పేర్లు తెరపైకి వచ్చాయి. చివరగా బోడే ప్రసాద్ ఆ సీటును దక్కించుకున్నారు. దీంతో సీనియర్ నేత యలమంచిలి కిషోర్ బాబు ఆధ్వర్యంలో బాణా సంచాలు కాల్చి, స్వీట్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కంకిపాడు మండల పార్టీ అధ్యక్షుడు సుదిమల్ల రవీంద్ర, మాజీ ఎంపీపీ దేవినేని రాజా, మాజీ జడ్పీటీసీ గొంది శివరామకృష్ణ, సీనియర్ నాయకులు తుమ్మలపల్లి హరికృష్ణ, ఈడుపగల్లు సర్పంచ్ పందిపాటి ఇందిరతో పాటు బండి నాంచారయ్య, యేనుగ జయ, పచ్చిపాల రాజా, విక్రమ్, బొర్రా వెంకట్, కొలుసు గోవింద్, గుమ్మడి కిరణ్ లు హర్షం వ్యక్తం చేశారు.

## తెలంగాణలో యత్నిస్తే.. ఆంధ్రాలో ఫలించింది

**వరంగల్ టిక్కెట్ కోసం కృష్ణప్రసాద్ యత్నం**

**బాపట్ల టిక్కెట్ దక్కించుకున్న మాజీ ఐపిఎస్**

**బాపట్ల:** తెలంగాణలో అదృష్టం కోసం వెతికితే ఆంధ్రాలో దొరికింది. అనూహ్యంగా మాజీ ఐపిఎస్ బాపట్లో టిక్కెట్ దక్కించుకున్నారు. వరంగల్ టిక్కెట్ కోసం ప్రయత్నించిన మాజీ పోలీస్ అధికారి కృష్ణ ప్రసాద్ కొద్ది రోజులుగాతీవ్ర ప్రయత్నాలు చేశారు. వరంగల్‌లో పోటీ తీవ్రంగా ఉండటంతో ఏపీలో బాపట్ల టిక్కెట్ కోసం ప్రయత్నించి విజయం సాధించారు. ఆయన అత్త శమంతకమణి గతంలో టీడీపీ ప్రభుత్వంలో మంత్రిగా పనిచేశారు. ఆ పరిచయాలతోనే ఆయనకు బాపట్ల టిక్కెట్ ను టీడీపీ కేటాయించింది. టీడీపీ ఎంపీ అభ్యర్థుల జాబితాలో అనూహ్యంగా తెలంగాణ క్యాడర్ మాజీ డీజీ స్థాయి అధికారి తెన్నేటి కృష్ణ ప్రసాద్‌ను ఖరారు చేశారు. కృష్ణ ప్రసాద్ వాస్తవానికి కొద్ది రోజుల క్రితం వరకు బీజేపీ తరపున వరంగల్ టిక్కెట్ ఆశించారు. కొంత కాలంగా వరంగల్‌లో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న తెన్నేటి కృష్ణప్రసాద్ వరంగల్ టిక్కెట్ కోసం తీవ్రంగా ప్రయత్నించారు. ప్రధాని మోదీ పర్యటనల్లో కూడా ఆయనకు స్వాగతం పలికారు. బీజేపీలో ఆయన అభ్యర్థిత్వం ఖాయమని భావించిన వేళ అనూహ్యంగా ఏపీలో టీడీపీ టిక్కెట్ దక్కింది. ఏపీలో బీజేపీ-టీడీపీ-జనసేన కూటమి తరపున ఆయన పోటీ చేయను న్నారు. విజయవాడ పోలీస్ కమిషనర్‌గా, వరంగల్, విశాఖ రేంజ్‌లలో డిఐజిగా పనిచేశారు. నెల్లూరు, విశాఖపట్నం, మెదక్, గుంటూరు ఎస్పీలుగా గతంలో పనిచేశారు. ఉమ్మడి గుంటూరులో భాగమైన బాపట్లలో లోక్‌సభ్ ఎన్నికల్లో పోటీ చేయడానికి గతంలో ఎస్పీగా పనిచేసిన అనుభవం పనికొస్తుందనే ఉద్దేశంతో కృష్ణప్రసాద్ అభ్యర్థిత్వానికి టీడీపీ మొగ్గు చూపింది. బాపట్ల ఎంపీ అభ్యర్థి స్థానికేతర్లకు కేటాయించడంపై స్థానిక నేతలు అసంతృప్తితో ఉన్నారు. పార్టీ అధిష్ఠానానికి తీవ్రమైన ఒత్తిడి టిడిపికి వస్తున్నట్లుగా సమాచారం. ఈ నేపథ్యంలో ఎస్సీ మాల సామాజిక వర్గానికి చెందిన కొంతమంది నాయకులు బాహాటంగానే బాపట్ల పార్లమెంటు నియోజకవర్గంలో చంద్రబాబు నిర్ణయాన్ని వ్యతిరేకి స్తున్నారు. అదేవిధంగా బాపట్ల ఎంపీ అభ్యర్థులు ఎస్సీ మాల సామాజిక వర్గానికి ఇవ్వాలని ఎందుకంటే బాపట్ల పార్లమెంటులో మాలలు ఎక్కువ శాతం ఉన్నారని ఖచ్చితంగా మాలలకు సీటు ఇవ్వాలనే డిమాండ్ కూడా చేస్తున్నారు. 1960లో హైదరాబాద్ జన్మించిన తెన్నేటి కృష్ణప్రసాద్ తల్లిదండ్రులు ఉపాధ్యాయులు గా పనిచేశారు. తండ్రి సుబ్బయ్య ఐటీఐ ప్రిన్సిపల్‌గా తల్లి విజయలక్ష్మి స్కూల్ టీచర్‌గా పనిచేశారు.

# కేజ్రీవాల్ అరెస్ట్‌తో ఆప్‌ను నడిపేదెవరు?

న్యూఢిల్లీ,: ఢిల్లీ లిక్కర్ స్కామ్ కేసులో కింగ్‌పిన్ కేజ్రీవాల్ అని ఇడి అధికారులు తెలిపారు. ఇది కేవలం వందకోట్ల వ్యవహారం కాదని, లంచాల్లో భాగస్వామ్యం కూడా తోడు కావడంతో ఈ మొత్తం కనీసం 600కోట్లు ఉంటుందని ఇడి కోర్టుకు తెలియచేసింది. గురువారం రాత్రి అరెస్టయిన ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్‌ను రౌస్ అవెన్యూ కోర్టులో ఈడీ అధికారులు ప్రవేశపెట్టారు. ఈ కేసులో ప్రశ్నించేందుకు కేజ్రీవాల్‌ను 10 రోజులపాటు కస్టడీకి అప్పగించాలని జడ్జిని ఈడీ కోరింది. ఢిల్లీ లిక్కర్ స్కామ్ కేసులో నిందితుడిగా ఉన్న అరవింద్ కేజ్రీవాల్‌ను గురువారం రాత్రి 9:05 గంటలకు అరెస్టు చేశామని, 24 గంటల్లోపు అతడిని జడ్జి ముందు హాజరుపరిచినట్టు ఈడీ పేర్కొంది. రిమాండ్ కోరుతూ దరఖాస్తు ఇచ్చామని, అన్ని నిబంధనలను పాటించి కేజ్రీవాల్‌ను అరెస్ట్ చేశామని ఈడీ అధికారులు కోర్టుకు వెల్లడించారు. కేజ్రీవాల్ అరెస్టుపై బంధువులకు కూడా సమాచారం అందించామని, అరెస్టుకు సంబంధించిన ఆధారాలను 28 పేజీల్లో రాతపూర్వకంగా అందజేశామని వివరించారు. అరెస్టు పంచనామా కూడా తమ వద్ద ఉందని ఈడీ తరపు న్యాయవాదులు కోర్టుకు వెల్లడించారు. ఢిల్లీ లిక్కర్ స్కామ్ కేసులో సీఎం అరవింద్ కేజ్రీవాల్ కీలకమైన వ్యక్తి అని, కొందరు వ్యక్తులకు మేలు చేసేందుకు డబ్బులు అడిగారని రౌస్ అవెన్యూ కోర్టుకు ఈడీ వెల్లడించింది. అక్రమ మార్గంలో వచ్చిన ఈ డబ్బుని గోవా ఎన్నికల్లో ఆమ్ ఆద్మీ పార్టీ ఉపయోగిం చిందని పేర్కొంది. మద్యం విధానం రూపకల్పనలో కేజ్రీవాల్‌కు ప్రత్యక్ష పాత్ర ఉందని, స్కామ్‌లో ప్రధాన వ్యక్తి ఆయనేనని తెలిపింది. ఇక ఈ కేసులోనే అరెస్టయిన ఢిల్లీ మాజీ డిప్యూటీ సీఎం, ఆప్ నేత మనీష్ సిసోడియా బెయిల్ లభించలేదని న్యాయస్థానం దృష్టికి ఈడీ పేర్కొంది. ఈ కేసులో సహ నిందితురాలుగా ఉన్న బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత వాంగ్మూలాన్ని కూడా తీసుకున్నామని ప్రస్తావించింది. ఆప్ మాజీ కమ్యూనికేషన్స్ ఇన్‌ఛార్జ్ విజయ్ నాయర్ సీఎం అరవింద్ కేజ్రీవాల్ వద్ద పనిచేస్తున్నారని, కేజ్రీవాల్‌తో చాలా సన్నిహితంగా ఉండే విజయ్ నాయర్ మధ్యవర్తిగా వ్యవహరించాడని ఈడీ పేర్కొంది. సౌత్ గ్రూప్ నుంచి కేజ్రీవాల్ డబ్బు డిమాండ్ చేశారని, ఈ విషయాన్ని నిరూపించడానికి తమ వద్ద ఆధారాలు ఉన్నాయని ఈడీ తరపు న్యాయవాదులు కోర్టుకు తెలిపారు. రెండు పర్యాయాలు నగదు బదిలీ జరిగిందని వివరించారు. సౌత్ గ్రూప్‌కు లిక్కర్ పాలసీలో లబ్ది చేకూర్చేందుకు ముడుపులు తీసుకున్నారని వివరించారు. లిక్కర్ పాలసీ రూపకల్పనలో భాగంగా ఎమ్మెల్సీ కవితను కేజ్రీవాల్ కలిశారని, కలిసి పని చేద్దామంటూ కవితతో సీఎం కేజ్రీవాల్ చెప్పారని ఈడీ పేర్కొంది. విజయ్ నాయర్ అరవింద్ కేజ్రీవాల్ కోసం పనిచేశారని, గోవా ఎన్నికల సమయంలో రూ.45 కోట్లు చేతులు మారాయని కోర్టుకు ఈడీ వెల్లడించింది. ఈ కేసుకు సంబంధించిన ఆధారాలలో ఫోన్ రికార్డ్స్ కూడా ఉన్నాయని రౌస్ అవెన్యూ కోర్టుకు ఈడీ తెలిపింది. విజయ్ నాయర్‌కు సంబంధించిన కంపెనీ నుంచి ఆధారాలు సేకరించామని, రూ.45 కోట్లు హవాలా మార్గంలో తరలించినట్టు తేలిందని, పెద్ద మొత్తంలో నిధులు వివిధ వ్యక్తుల ద్వారా చేతులు మారాయని వివరించింది. మద్యం కుంభకోణం కేసులో దిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ కీలక
సూత్రధారి అని ఈడీ ఆరోపించింది. 'సౌత్ గ్రూప్' సంస్థకు, నిందితులకు మధ్య ఆయన మధ్యవర్తిగా వ్యవహరించారని పేర్కొంది. మద్యం కుంభకోణంలో అరవింద్ కేజ్రీవాల్ కింగ్‌పిన్. దిల్లీ ఎక్సైజ్ పాలసీ రూపకల్పన, అమలుకు 'సౌత్ గ్రూప్' సంస్థ నుంచి రూ.కోట్ల ముడుపులు అందుకున్నారు. పంజాబ్ ఎన్నికల కోసం ఆ సంస్థకు చెందిన కొందరు నిందితుల నుంచి రూ.100 కోట్లు డిమాండ్ చేశారు.



రూ.45 కోట్ల ముడుపులను గోవా ఎన్నికల్లో ఉపయోగించారు. అవి నాలుగు హవాలా మార్గాల నుంచి వచ్చాయని ఈడీ తరఫు న్యాయవాదులు వాదించారు. అయితే ఇడి వాదనలను కేజ్రీవాల్ అడ్వకేట్ మను సింఘ్వి తీవ్రంగా ఖండించారు. ఆధారాలు లేని కేసులో అరెస్ట్ చేశారని అన్నారు. ఆధారాలు ఉంటే కస్టడీ ఎందుకని ప్రశ్నించారు.

**పార్టీలో ప్రధాన చర్చగా ఢిల్లీ పీఠం**

**న్యూఢిల్లీ:** ఆప్‌ను నడిపించేదెవరు అన్న ప్రశ్న ఇప్పుడు ఉదయిస్తోంది. కేజ్రీవాల్ అరెస్ట్‌తో ఆ పార్టీని ముందుకు తీసుకుని వెళ్లేదెవరని చర్చ సాగుతోంది. అలాగే ఢిల్లీ సిఎంగా ఎవరుంటారన్నది కూడా ఆ పార్టీలో ప్రధాన సమస్యగా మారనుంది. మనీష్ సిసోడియా జైలుకు వెళ్లిన తర్వాత ఢిల్లీ ప్రభుత్వంలో అతిషి కీలక నేతగా మారారు. ఓ విధంగా చెప్పాలంటే పార్టీలో ఆమె నెంబర్ టూ అయ్యారు. రాఘవ్ చద్దా గోపాల్ రాయ్, సౌరభ్ భరద్వాజ్ వంటి నేతలు ప్రస్తుతం ఆప్‌లో ముఖ్య నేతలుగా ఉన్నారు. గోపాల్ రాయ్ కేజ్రీవాల్‌కు అత్యంత నమ్మకస్తునిగా ఉన్నారు. కేజ్రీవాల్ ఢిల్లీ లిక్కర్ స్కామ్ కేసులో జైలుకు వెళితే ఆప్ పరిస్థితి ఎలా ఉండబోతుందనే చర్చ ప్రస్తుతం జరుగుతోంది. కేజ్రీవాల్ అరెస్ట్‌పై న్యాయ పోరాటానికి ఆ పార్టీ సిద్ధమైంది. కోర్టు ఈ కేసులో ఎలాంటి తీర్పునిస్తుందనే తెలియాల్సి ఉంది. ముందుగా సత్యేందర్ జైన్‌ను, ఆ తర్వాత మనీష్ సిసోడియాను, ఇప్పుడు కేజ్రీవాల్‌ను ఈడీ అరెస్టు చేసింది. సరిగ్గా లోక్‌సభ ఎన్నికల వేళ కేజ్రీవాల్‌ను అరెస్టు చేయడం ద్వారా ఆ పార్టీ శ్రేణులు డీలా పడేలా చేయాలనే బీజేపీ వ్యూహం ఉందనే అనే అనుమానాలు ఉన్నాయి. ఆమ్ ఆద్మీ పార్టీ ఈసారి ఎన్నికల్లో ఇండియా కూటమిలో ప్రధాన భాగస్వామిగా ఉంది. ఢిల్లీ, పంజాబ్, గుజరాత్, గోవా, హర్యానా,
అస్సాంలోనూ పోటీ చేయాలని ఆప్ నిర్ణయించింది. కేజ్రీవాల్‌ను అరెస్టు చేస్తారనే ప్రచారం దాదాపుగా ఏడాదిగా ఉండగా.. సరిగ్గా లోక్‌సభ ఎన్నికల నోటిఫికేషన్ వచ్చి ఆమ్ ఆద్మీ పార్టీ ఎన్నికలకు సన్నద్ధం అవుతున్న వేళ అరెస్టు చేయడం వెనుక బీజేపీ రాజకీయ కుట్ర ఉన్నదని ఆప్ నేతలు ఆరోపిస్తున్నారు. పార్టీని నడిపించేది ఎవరు అమ్ ఆద్మీ పార్టీకి కేజ్రీవాలే కన్వీనర్. ఆయనే స్టార్ క్యాంపెయినర్. ఆయన అరెస్టు పార్టీకి పెద్ద దెబ్బ. కేజ్రీవాల్ అరెస్టుతో ఆయన స్థానంలో ఆయన భార్య సునీత పార్టీ పగ్గాలు అందుకుంటారనే ప్రచారం ఉంది. పంజాబ్ సీఎం భగవంత్ మాన్, ఢిల్లీ మంత్రి ఆతిశీ పేర్లు కూడా వినిపిస్తున్నాయి.

**అవినీతి మరక అంటితే సింఎం అయినా లెక్కలేదు**

**గతంలో తమిళనాడు సింఎంగా జయలలితపై అవినీతి కేసు**

**జార్ఖండా సింఎం హేమంత్ సోరేన్‌కు అదేగతి**

**న్యూఢిల్లీ:** ఢిల్లీ లిక్కర్ కేసులో ఆమ్ ఆద్మి పార్టీ అధినేత, ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్‌ను ఈడీ అధికారులు అరెస్టు చేయడంతో ఇప్పుడు అనేక ప్రశ్నలు ఉదయిస్తున్నాయి. సిఎంగా అధికారంలో ఉండగా ఓ రాష్ట్ర ముఖ్యమంత్రిని దర్యాప్తు సంస్థలు అరెస్టు చేయవచ్చా అనే సందేహాలు సర్వత్రా వ్యక్తం అవుతున్నాయి. దీనికి చట్టం ఏం చెబుతోంది..? అందుకు సంబంధించిన విధివిధానలు ఏమిటి అనే విషయాలు ఇప్పుడు చర్చనీయాంశంగా మారయి. అయితే తమిళనాడు సిఎంగ ఆఉన్న సమయంలో జయలలితపై అవినీతి కేసులు నమోదయ్యాయి. ఆమెను అరెస్ట్ చేసే సమయం రావడంతో రాజీనామా చేసి, తన స్థానంలో పన్నీరు సెల్వంను సిఎంగా చేసి సందర్భం ఉంది. ఇకపోతే చట్టం దృష్టిలో ప్రతి భారతీయుడు సాధారణ వ్యక్తే.అన్నది రాజ్యాంగం చెబుతోంది. ఇందుకు ఎటువంటి నిబంధనలు లేనందువల్ల వారిపై క్రిమినల్ నేరం నమోదైతే దేశ ప్రధానమంత్రినైనా అరెస్ట్ చేయవచ్చుని నిపుణులు అంటున్నారు. పాలకుల నుంచి సాధారణ వ్యక్తుల వరకు ఈ నియమం అందరికీ వర్తిస్తుందని చెబుతున్నారు. అయితే రాజ్యాంగం ప్రకారం రాష్ట్రపతిని మాత్రమే పదవిలో ఉన్నప్పుడు అరెస్టు చేయడానికి వీలులేదు. ఆర్టికల్ 361 ప్రకారం భారత రాష్ట్రపతి, రాష్ట్రాల గవర్నర్లు.. వారి అధికార విధులకు సంబంధించి కోర్టులకు జవాబుదారీగా ఉండరు. ఈ నిబంధన కింద రాష్ట్రపతి, గవర్నర్ తన పదవికి సంబంధించిన అధికారాలు, విధులను అమలు చేయడం, వారు చేసిన, చేయాలనుకుంటున్న ఏదైనా చర్యకు ఏ న్యాయస్థానానికి జవాబుదారీగా ఉండనవ సరం లేదు. ఈ ప్రత్యేక మినహాయింపు ఒక్క రాష్ట్రపతి, గవర్నర్‌లకు మాత్రమే ఉంటుంది. అందువల్ల వారు పదవిలో ఉన్నప్పుడు క్రిమినల్ నేరాలలో కూడా అరెస్ట్ చేసే అధికారం ఎవరికీ లేదు. పదవీ విరమణ అనంతరం మాత్రమే వారిపై చర్యలు తీసుకునేందుకు అవకాశం ఉంటుంది. వీరి పదవీకాలం ముగిసే వరకు సివిల్, క్రిమినల్ ప్రొసీడింగ్‌ల నుంచి నిరోధించవచ్చు. కానీ ప్రధానమంత్రి, ముఖ్యమంత్రులకు ఈ రక్షణ ఉండదు. చట్టం ముందు అందరూ సమానమనేది ముఖ్యమంత్రులు, ప్రధానమంత్రికి కూడా వర్తిస్తుంది. అందుకే వివిద సందర్భాల్లో కొందరు రాజీనామా చేసిన సందర్భాలు ఉన్నాయి. క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ 1973 నిబంధనల ప్రకారం.. కోర్టు అరెస్టు వారెంట్ జారీ చేస్తే ఏ వ్యక్తినైనా అరెస్టు చేయవచ్చు. నిందితుడు పరార్ అయ్యే అవకాశం ఉందని, సాక్ష్యాలను ధ్వంసం చేయడానికి ప్రయత్నిస్తాడని, చట్టపరమైన పక్రియ నుంచి తప్పించుకునే విధంగా ప్రవర్తిస్తాడనడానికి తగిన కారణం ఉంటే మాత్రమే వారిని అరెస్టు చేయాలి. ఈ లెక్కన ఓ రాష్ట్ర ముఖ్యమంత్రిని అరెస్ట్ చేసే
అధికారం రాజ్యంగం ప్రకారం ఉంటుంది. అయితే సివిల్ ప్రొసీజర్ కోడ్ సెక్షన్ 135 ప్రకారం.. పార్లమెంటు సభ్యులు 40 రోజుల ముందు, 40 రోజుల తర్వాత, పార్లమెంటు సమావేశాలు
జరుగుతున్న సమయంలో అరెస్టు చేయడానికి వీలులేదు. మూడు పార్లమెంటు సమావేశాలు ఒక్కొక్కటి 70 రోజులు ఉండటంతో, దాదాపు 300 రోజుల వరకు వీరిని అరెస్ట్ చేసే అధికారం ఉండదు. ఈ రక్షణ కేవలం సివిల్ కేసులకు మాత్రమే వర్తిస్తుంది. ఇతర నేరాల విషయంలో రాజ్యసభ, లోక్‌సభ సభ్యులెవరికీ రక్షణ ఉండదు.
దేశ చరిత్రలో అత్యంత వివాదాస్పద రాజకీయనాయకుల్లో దివంగత మాజీ ముఖ్యమంత్రి జయలలిత ఒకరు. విలక్షణమైన వ్యక్తిత్వంతో తమిళనాడు రాష్ట్రానికిపలుమార్లు ముఖ్యమంత్రిగా పనిచేశారు. అయితే ఆదాయానికి మించిన ఆస్తుల కేసుకు సంబంధించి దేశంలో మొట్టమొదటి సారి అరెస్ట్ అయిన సిట్టింగ్ ముఖ్యమంత్రిగా పేరుగాంచారు. గ్రామాలకు కలర్ టీవీ సెట్ల కొనుగోలులో అవినీతికి పాల్పడినందుకు ఆమెను డిసెంబర్ 7, 1996న అరెస్టు చేయగా.. నెలపాటు జైలులో ఉన్నారు. ఇలా జార్ఖండా సిఎం, ఇప్పుడు కేజ్రీవాల్ అరెస్ట్ అయ్యారు.

## భోజ్‌శాలలపై మసీదు నిర్మాణంపై ఫిర్యాదులు

**భోజ్‌శాలలో ఆర్కియాలాజికల్ సర్వే**

**కోర్టు ఆదేశాలతో రంగంలోకి దిగిన పురావస్తు శాఖ**

**భోపాల్:**దేశవ్యాప్తంగా జ్ఞానవాపి మసీదు అంశం ఎంతటి వివాదాస్పద అంశంగా మారింది. అక్కడ హిందువులు పరమ పవిత్రంగా భావిస్తున్న కాశీ విశ్వనాథ్ ఆలయంపై జ్ఞానవాపి మసీదును నిర్మించారనడానికి చారిత్రక ఆనవాళ్లు ఉన్నాయి. ఈ అంశంపై విచారణ జరిపిన దేశ అత్యున్నత న్యాయస్థానం నేలమాళిగలోని హిందూ ఆలయంలో పూజలకు అనుమతించింది. ఈ క్రమంలో మధ్యప్రదేశ్‌లోని గిరిజనుల ప్రాబల్యం అధికంగా ఉన్న థార్ జిల్లాలోని వివాదాస్పద భోజ్‌శాల ఆలయంపై కమల్ మౌలా మసీదు నిర్మించారనే ఆరోపణలు వచ్చాయి. దీనిపై స్పందించిన భారత పురావస్తు శాఖ సర్వేకు ఉపక్రమించింది. శుక్రవారం తెల్లవారుజామున సర్వే బృందం ఘటనా స్థలానికి చేరుకుంది. మధ్యప్రదేశ్ హైకోర్టు ఆదేశాల మేరకు ఏఎస్ఐ ఈ చర్యలు చేపట్టింది. మధ్యప్రదేశ్‌లోని థార్ జిల్లాలో ఉన్న భోజ్‌శాలలో ఆర్కియాలజికల్ సర్వే చేపట్టాలని మధ్యప్రదేశ్ హైకోర్టు ఇండోర్ బెంచ్ మార్చి 11న ఆదేశాలు ఇచ్చింది. ఉత్తరప్రదేశ్‌కు చెందిన జ్ఞానవాపి తరహాలో నిర్వహించే ఈ సర్వే నివేదికను 6 వారాల్లోగా కోర్టుకు సమర్పించాలని ఆదేశించింది. భోజ్‌శాలలో హిందువుల పూజలు, ముస్లింలు నమాజ్ చేస్తుంటారు. ఈ ఆలయంగా భావిస్తున్న మసీదులోకి ఎంట్రీ టిక్కెట్ కేవలం ఒక్క రూపాయి ఉన్నప్పటికీ పూజలు, నమాజ్ చేసేందుకు ఉచిత సౌలభ్యం కల్పించారు. ఈ విషయమై హిందూ ఫ్రంట్ ఫర్ జస్టిస్ ఇండోర్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. హిందూ తరపు న్యాయవాది విష్ణు శంకర్ జైన్ వాదనలు వినిపిస్తూ భోజ్‌శాల సర్వే ఇరుపక్షాల సమక్షంలో జరుగుతుందని చెప్పారు.



## బిజెపి నాలుగో విడత జాబితా విడుదల

**తమిలనాడు విరుధు నగర్ నుంచి నటి రాధిక పోటీ**

**న్యూఢిల్లీ:**సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో భారతీయ జనతా పార్టీ స్పీడ్ పెంచింది. తమ పార్టీ అభ్యర్థులను వరుసగా ప్రకటిస్తోంది. ఇప్పటికే మూడు విడతలుగా 275 మంది అభ్యర్థుల పేర్లను ఖరారు చేసిన బీజేపీ.. ఇప్పుడు నాలుగో విడత అభ్యర్థులను ప్రకటించింది. నాలుగో విడతలో 15 మంది ఎంపీ అభ్యర్థుల పేర్లను ప్రకటించింది. ఈ జాబితాలో ముఖ్య నేతలతో పాటు.. ఊహించని వ్యక్తులకు కూడా టిక్కెట్ దక్కింది. తమిళనాడులో సీనియర్ నటి రాధికా శరత్ కుమార్‌కు బీజేపీ ఎంపీ టికెట్ ఇచ్చింది. విరుధునగర్ నుంచి ఆమో ఎంపీగా ఎన్నికల బరిలో నిలవనున్నారు.

**1. పుదుచ్చేరి - ఏ. నమశివాయం**
**2. తిరువల్లూర్(ఎస్సీ) - పోన్ వి బాలగణపతి**
**3. చెన్నై నార్త్ - ఆర్.సి పాల్ కనగరాజ్**
**4. నమక్కల్ - కే.పీ. రామలింగం**
**5. తిరుప్పూర్ - ఏ.పీ మురుగనందం**
**6. పొల్లాచి - కే. వసంతరాజన్**
**7. కరుర్ - వి.వి సెంతిల్‌నాథన్**
**8. చిదంబరం (ఎస్సీ) - పి. కాత్యాయిని**
**9. నాగపట్టినమ్ - ఎస్.జి.ఎం రమేష్**
**10. తంజావూర్ - ఎం. మురుగనందం**
**11. శివగంగ - దేవనాథన్ యాదవ్**
**12. మదురై - ప్రొఫెసర్ రామ శ్రీనివాసన్**
**13. విరుధునగర్ - రాధికా శరత్ కుమార్**
**14. టెన్‌కాశి (ఎస్సీ) - బి. జాన్ పాండియన్**
**15. తిరువన్నమలై - ఏ. అశ్వద్ధామన్**

# లీగల్ సర్వీసెస్" షార్ట్ ఫిలింల ప్రదర్శన.





## చట్టాలపై అవగాహనను పెంపొందిస్తాయని కలెక్టర్ వెల్లడి.

## పాల్గొన్న జిల్లా జడ్జి, పోలీస్ కమిషనర్.

**వేగుచుక్క న్యూస్,నిజామాబాద్, మార్చి 22**

న్యాయ సేవాధికార సంస్థ పనితీరును వివరిస్తూ, చట్టాలపై ప్రజలలో అవగాహన పెంపొందించేందుకు, అన్యాయాలు, మోసాలకు గురైన సందర్భాలలో న్యాయ సహాయం ఎలా పొందాలనే అంశాలను వివరిస్తూ రూపొందించిన షార్ట్ ఫిలింలను శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఉషామయూరి మల్టిప్లెక్స్ థియేటర్ లో ప్రదర్శించారు. జిల్లా జడ్జి సునీత కుంచాల నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమానికి కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు ముఖ్య అతిథిగా విచ్చేయగా, పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్, ఇతర అధికారులు, న్యాయవాదులు, వివిధ శాఖల అధికారులు, వివిధ వర్గాల వారు పాల్గొని ఎంతో ఆసక్తిగా షార్ట్ ఫిలిం లను తిలకించారు. చిన్నారుల పట్ల లైంగిక నేరాలకు పాల్పడితే పోక్సో చట్టం కింద అమలయ్యే కఠిన శిక్షలు, బాధితులు న్యాయ సేవాధికార సంస్థ ద్వారా ఏ విధంగా సహాయం పొందవచ్చు అనే అంశాలతో కూడిన షార్ట్ ఫిలిం అందరినీ ఆలోచింపజేసింది. అదేవిధంగా సైబర్ నేరాలు, బాల్య వివాహాలు, మానసిక రుగ్మతలకు సరైన చికిత్స చేయించకుండా మూఢ నమ్మకాలతో ముడిపెట్టడం, బాలికల విద్యకు ప్రాధాన్యత ఇవ్వాల్సిన ఆవశ్యకత తదితర అంశాలను ఎంతో అర్ధవంతంగా స్పృశిస్తూ సీత కథ, వల, ముందడుగు, గెలుపు, మలుపు, మనో వ్యాధి, జోజో పాపాయి శీర్షికలతో రూపొందించిన తక్కువ నిడివి కలిగిన ఫిలింలు అయినప్పటికీ ఆలోచింపజేశాయి. ముఖ్యంగా పై సందర్భాలలో అన్యాయాలు, మోసాలకు గురయ్యే వారికి లీగల్ సర్వీసెస్ అథారిటీ ద్వారా అందిస్తున్న సేవల గురించి అర్ధమయ్యే రీతిలో షార్ట్ ఫిలింల ద్వారా తెలియజేశారు.

ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా విచ్చేసిన కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు మాట్లాడుతూ, సామాజిక స్పృహతో వివిధ వర్గాల వారిని చైతన్యపరిచేందుకు జిల్లా న్యాయసేవాధికార సంస్థ క్రియాశీలకంగా వ్యవహరిస్తూ అనేక కార్యక్రమాలను నిర్వహిస్తోందని అభినందించారు. ఇదే కోవలో ఆయా చట్టాల పట్ల, నేటి సమాజంలో పెచ్చుమీరిన సైబర్ నేరాలు, చిన్నారులపై లైంగిక దాడులు వంటి వాటి గురించి ప్రజలను జాగృతపర్చేందుకు, సహాయం పొందే మార్గాల గురించి షార్ట్ ఫిలింల ద్వారా వివరించే ప్రయత్నం చేయడం జరిగిందన్నారు. నేరాల నియంత్రణ దిశగా, చట్టాలపై ప్రజల్లో అవగాహన కల్పించాలనే సదుద్దేశంతో రూపొందించిన ఈ షార్ట్ ఫిలింలను ప్రజలందరికి చేరేవిధంగా పబ్లిక్ డొమైన్ లో పెట్టడమే కాకుండా అన్ని థియేటర్లలో ప్రదర్శించేలా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు. జిల్లా జడ్జి సునీతా కుంచాల మాట్లాడుతూ, న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో రూపొందించిన షార్ట్ ఫిలిం ప్రదర్శనను రాష్ట్ర స్థాయిలో హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి లాంఛనంగా ప్రారంభించగా, ప్రాంతీయ స్థాయిలో మొట్టమొదటగా నిజామాబాద్ జిల్లాలోనే వీటిని విడుదల చేయడం జరుగుతోందన్నారు. నేర రహిత సమాజ నిర్మాణమే లక్ష్యంగా, చట్టాల పట్ల ప్రజల్లో అవగాహన పెంపొందిస్తూ, అన్యాయాలకు గురైన సందర్భాలలో బాధితులు మనోధైర్యం కోల్పోకుండా న్యాయ సేవాధికార సంస్థ ద్వారా ఏ మేరకు సహాయం పొందవచ్చు అనే అంశాలను తెలియజేస్తూ రూపొందించిన షార్ట్ ఫిలింలు అవగాహన పెంపొందించేందుకు ఎంతగానో దోహదపడతాయని అన్నారు. వీటి నిర్మాణానికి సహకరించిన వారందరికీ డీఎస్ఎల్ఏ తరఫున కృతజ్ఞతలు తెలియజేశారు. పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్ మాట్లాడుతూ, మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా నేటి సమాజంలో డిజిటల్ నేరాలు పెరిగిపోయాయని, వాటి పట్ల ప్రజల్లో అవగాహన కల్పించేలా షార్ట్ ఫిలిం రూపొందించడం ఎంతో గొప్ప విషయం అన్నారు. బాలలు, చిన్నారులపై నేరాలకు పాల్పడితే పోక్సో చట్టం కింద కఠిన శిక్షలు ఎదుర్కోవాల్సి వస్తుందనే అంశాలను చక్కగా వివరించారని అన్నారు. సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అపోహలను దూరం చేసుకుని అవగాహన ఏర్పర్చుకునేందుకు ఇలాంటి షార్ట్ ఫిలింలు దోహదపడతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో జడ్జి పద్మావతి, నగరపాలక సంస్థ కమిషనర్ మకరంద్, ఏఎస్పీ శేషాద్రిని రెడ్డి, ట్రైనీ ఐపీఎస్ చైతన్య రెడ్డి, షార్ట్ ఫిలింలకు దర్శకత్వం వహించిన సాయిప్రసాద్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# పంట నష్టం వివరాలు క్షేత్ర స్థాయిలో తీసుకోవాలి.

**- నష్టం జరిగిన ప్రతి రైతుకి పరిహారం చెల్లించాలి.**

**ఎమ్మెల్యే కాటిపల్లి వెంకట రమణ రెడ్డి.**

**వేగుచుక్క న్యూస్, కామారెడ్డి, మార్చి 22:**



పంట నష్టం వివరాలు అధికారులు క్షేత్ర స్థాయిలో వెళ్లి తీసుకోవాలనీ, నష్టం జరిగిన ప్రతి రైతుకి పరిహారం చెల్లించాలనీ ఎమ్మెల్యే కాటిపల్లి వెంకట రమణ రెడ్డి అన్నారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయములో శుక్రవారం ఎర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వెంకట రమణ రెడ్డి మాట్లాడారు. ఇటీవల పడ్డ వడగళ్ల వానకి నష్టపోయిన పంట వివరాలు అధికారులు క్షేత్ర స్థాయిలో వెళ్లి తీసుకోవాలి కానీ కలెక్టర్ తో సహా ఎవ్వరూ క్షేత్ర స్థాయిలోకి వెళ్ళడం లేదని అన్నారు. ప్రకృతి వైపరీత్యాల విషయంలో సహాయ కార్యక్రమలకు ఎన్నికల కోడ్ ఏమి అడ్డు రాధని అన్నారు. ఇంఛార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు రైతులను పరామర్శించడం ఆనందదాయం అని, కానీ వారు చెప్పినట్టుగా పంట నష్టం జరిగిన ప్రతి రైతుకి చెల్లించాలి అని డిమాండ్ చేశారు. పంట నష్టపరిహారం రైతుల ఎంపిక విషయంలో ఏ ఒక్క రైతును విస్మరించినా ఊరుకునేది లేదని అన్నారు. గత ప్రభుత్వం పోయిన సంవత్సరం పంట నష్టపోయిన రైతులకు ఏకరాకు 10 వేళ నష్ట పరిహారం ప్రకటించినా, రైతులకి ఒక్క రూపాయి కూడా చెల్లించలేదనీ అన్నారు. ఈ సారి పునరావృతం అయితే ఉద్యమం తప్పదని హెచ్చరించారు.ఎలక్ట్రిసిటీ అధికారులు పంట పొలాల్లో పడిపోయిన స్తంభాలు, ఇతర నష్టాలకు రైతుల నుండి డబ్బులు తీసుకోకుండా త్వరితగతిన పునరుద్దరణ చేయాలని అన్నారు.

# జల సంరక్షణ ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత.



**- "సత్యశోధక్" ప్రిన్సిపాల్ ఆర్. నర్సయ్య.**

**వేగుచుక్క న్యూస్, సిరికొండ, మార్చి 22:**

జీవావరణానికి జల ధార ప్రాణధారమని, జల సంరక్షణ ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని సత్యశోధక్ పాఠశాల ప్రిన్సిపాల్ ఆర్. నర్సయ్య అన్నారు. ప్రపంచ జల దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం సత్యశోధక్ పాఠశాలలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో విద్యార్థులు, సిబ్బంది నీటి సంరక్షణ ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ ఆర్. నర్సయ్య మాట్లాడుతూ, నీరు లేనిదే సమస్త జీవకోటికి మనుగడ లేదని ప్రకృతి వనరుల, పర్యావరణం యొక్క అసమతుల్యతే ప్రస్తుత నీటి ఏద్దడికి ప్రధాన కారణమని తెలిపారు. ప్రకృతిని పరిరక్షించడం, కాలుష్య కారకాలను నిర్మూలించడంలో మానవులు క్రియాశీలక పాత్ర పోషించడం ద్వారానే సమస్త జీవకోటి మనుగడకు దోహదమౌతుందన్నారు. భవిష్యత్ తరాలకు కరువు కాటకాలు లేని ఆరోగ్యకరమైన సమాజాన్ని నిర్మించడంలో, పర్యావరణ సమతుల్యతను కాపాడడంలో ప్రతి ఒక్కరు ముందుండలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# కేసుల సత్వర పరిష్కారమే ధ్యేయం కావాలి.

**- హైకోర్టు జడ్జి, జస్టిస్ లక్ష్మీనారాయణ అలిశెట్టి.**







**వేగుచుక్క న్యూస్,కామారెడ్డి, మర్చి 22**

కేసుల సత్వర పరిష్కారమే అందరి ధ్యేయం కావాలని హై కోర్టు జడ్జి, అడ్మినిస్ట్రేటివ్ జడ్జి జస్టిస్ లక్ష్మీనారాయణ అలిశెట్టి అన్నారు. శుక్రవారం జిల్లా న్యాయస్దాన భవనములందు నూతన 2వ అదనపు ప్రథమ శ్రేణి న్యాయస్థానం (కోర్టు) ను వర్చువల్ పద్దతిన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి యస్.యెన్. శ్రీదేవి, జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్, ఎస్పీ సింధు శర్మ, అడిషనల్ జిల్లా న్యాయ మూర్తి లాల్ సింగ్, శ్రీనివాస్ నాయక్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జస్టిస్ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ కేసులు త్వరగా పరిష్కకరించడమే తమ ధ్యేయమని,. కోర్టులకు వెళ్ళితే సత్వర న్యాయం జరుగుతుందనే నమ్మకం కక్షిదారులల్లో కలిగేలా న్యాయ వ్యవస్థ పనిచేయాలని హితవు పలికారు. పెరుగుతున్న జనాభా కనుగుణంగా న్యాయస్థానాల ఏర్పాటు ఆవశ్యకత కూడా పెరిగిందని అన్నారు. కేసులు త్వరితగతిన పరిష్కారం కావాలని, ఏళ్ల తరబడి కేసులు పెండింగులో ఉండడం మంచిదికాదని అన్నారు. రాజ్యాంగంలో పొందుపరచిన చట్టాలకనుగుణంగా అందరు నడుచుకొని పెండింగు కేసులను త్వరగా పరిష్కరించాలన్నారు. న్యాయ వ్యవస్థకు బార్ - బెంచ్ రెండు చక్రాలంటివని, రెండు సక్రమంగా పనిచేస్తేనే కేసులు సత్వర పరిష్కారమై కక్షిదారులకు న్యాయం చేకూర్చిన వారవుతామన్నారు. బార్ అసోసియేషన్ అధ్యక్షులు శ్రీధర్ మాట్లాడుతూ, కామారెడ్డి జిల్లాల్లో ఎస్సి/ఎస్టీ కోర్టు, మరొక సివిల్ కోర్ట్ అవసరం ఉందని అన్నారు. అనంతరం ప్రధాన న్యాయ మూర్తి, కలెక్టర్, ఎస్పీ, న్యాయమూర్తులు కలిసి నూతనంగా ఏర్పాటు చేసిన కోర్టు హాలు, జడ్జి ఛాంబర్ ను సందర్శి ంచి పూజలు నిర్వహించారు. 2 వ అదనపు ప్రథమ శ్రేణి న్యాయ స్థానం జడ్జి గా జూనియర్ సివిల్ జడ్జి సుధాకర్ ఇంచార్జి భాధ్యతలు తీసుకుని ఆసీనులయ్యారు. ఈ కార్య క్రమంలో సీనియర్ సివిల్ జడ్జి నాగరాణి , , అడిషనల్ జ్యుడిషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ దీక్ష, జిల్లా కోర్టు అడ్మిని స్ట్రేటివ్ ఆఫీసర్ శ్రీదేవి, సూపెరింటెండెంట్లు వెంకట్ రెడ్డి, శ్రీధర్, చంద్రసేన్ రెడ్డి, న్యాయమూర్తులు, సిబ్బంది పాల్గొన్నారు.

# కిరణ్ మరణం తీరని లోటు: ఐఎఫ్ టియు.

**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్, మార్చి 22**



ప్రోగ్రెసివ్ ఆటో అండ్ మోటార్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు వడ్లకొండ కిరణ్ మరణం కార్మిక ఉద్యమానికి తీరని లోటని ఐఎఫ్ టియు నాయకులు అన్నారు. నగరంలోని కోటగల్లిలో గల ఎన్.ఆర్ భవన్ లో శుక్రవారం కిరణ్ చిత్రపటానికి భారత కార్మిక సంఘాల సమాఖ్య జిల్లా కమిటీ ఆధ్వర్యంలో పూలమాలలతో నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఐఎఫ్ టియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.నరేందర్, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎం.ముత్తెన్న ఎం.సుధాకర్ లు మాట్లాడుతూ, వి.కిరణ్ క్యాన్సర్ వ్యాధితో గురువారం మధ్యాహ్నం 3 గంటలకు హైదరాబాద్ లో మరణించాడని అన్నారు. కిరణ్ మరణం కార్మిక వర్గానికి, ముఖ్యంగా ఆటో కార్మిక వర్గానికి తీరని లోటని అన్నారు. కిరణ్ అనేక కార్మిక ఉద్యమాలలో, ప్రజా ఉద్యమాలలో, తెలంగాణ ఉద్యమంలో చురుకైన పాత్ర పోషించాడన్నారు. ముఖ్యంగా ఆటోరంగ కార్మికుల సమస్యలపై నిరంతరం పోరాడుతూ హైదరాబాద్ ఆటోరంగ కార్మికులతో పాటు, రాష్ట్రవ్యాప్త ఆటో రంగ కార్మికులకు అండగా నిలిచాడన్నారు. కిరణ్ క్యాన్సర్ వ్యాధితో అర్ధాంతరంగా మృతి చెందటం బాధాకరమన్నారు. వారి కుటుంబానికి తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. కిరణ్ దోపిడీ పీడనలు లేని, సమసమాజ నిర్మాణం కోసం కలలు కన్నాడని, అందుకోసం జరిగే ఉద్యమాలలో తన చివరి శ్వాస వరకు పాల్గొన్నాడని అన్నారు. కిరణ్ ఆశయ సాధన కోసం పోరాడడమే ఆయనకు నిజమైన నివాళి అని అన్నారు.

# మహిళలు ఆత్మస్థైర్యంతో ముందుకుసాగాలి







## కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు.

## టీఎన్జీవోల సంఘం ఆధ్వర్యంలో మహిళా ఉద్యోగులకు సన్మానం.

**వేగుచుక్క న్యూస్,నిజామాబాద్, మార్చి 22**

మహిళలు ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు సూచించారు. వివిధ ప్రభుత్వ శాఖలలో పురుష ఉద్యోగులకు ఏమాత్రం తక్కువ కాకుండా మహిళా ఉద్యోగులు సైతం సమర్ధవంతంగా విధులు నిర్వర్తిస్తూ ఉత్తమ సేవలు అందిస్తున్నారని అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని టీఎన్జీవోఎస్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో ఉత్తమ సేవలందించిన మహిళా ఉద్యోగులకు ఆత్మీయ సన్మానం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన కలెక్టర్ మాట్లాడుతూ, ముందుగా అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా టీఎన్జీవోఎస్ ఆధ్వర్యంలో మహిళా ఉద్యోగులకు క్రీడా పోటీలు నిర్వహించి, ఆత్మీయ సన్మానం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఈ సన్మానానికి మహిళా ఉద్యోగులు నూటికి నూరు శాతం అర్హులని, మహిళా ఉద్యోగులు విధులను నిర్వర్తిస్తూనే, మరోపక్క ఇంటి పనులు, కుటుంబ బాధ్యతలను కూడా చక్కబెడుతున్నారని, మొత్తంగా చూస్తే 360 డిగ్రీల కోణంలో నిరంతరం శ్రమిస్తున్నారని అన్నారు. అయితే మహిళలు తమ ఇంటిని చక్కదిద్దినట్లే సమాజ మార్పునకు కూడా దోహదపడాలని కలెక్టర్ హితవు పలికారు. ఇంకనూ సమాజంలో అక్కడక్కడా మహిళల పట్ల ఒకింత వివక్ష కనిపిస్తుందని, ఇది దూరం కావాలంటే మహిళలే క్రియాశీలక పాత్ర పోషించాల్సిన అవసరం ఎంతైనా ఉందని అభిప్రాయపడ్డారు. ప్రతి తల్లి తమ పిల్లలను ఆడ, మగ అనే భేదం లేకుండా సమాన దృక్పథంతో సమ ప్రాధాన్యత చూపాలని హితవు పలికారు. దీనివల్ల బాలికలు కూడా ధైర్యంగా ముందుకు సాగేందుకు అవకాశం కల్పించినట్లు అవుతుందన్నారు. అంతేకాకుండా సమ భావన వల్ల పురుషులు కూడా సమాజంలో మహిళల పట్ల గౌరవ భావం కలిగి ఉంటారని అన్నారు. చిన్ననాటి నుండే బాలికలలో ఆత్మస్థైర్యం పెంపొందిస్తూ, వారిని మానసికంగా దృఢత్వం కలిగి ఉండేలా తల్లిదండ్రులు తోడ్పాటును అందించాలని కలెక్టర్ హితవు పలికారు. మహిళల రక్షణ, భద్రతా కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక చట్టాలను అమలు చేస్తున్నాయని, వాటి గురించి అవగాహన ఏర్పర్చుకోవాలని సూచించారు. మహిళా ఉద్యోగులకు కూడా ప్రత్యేకంగా కొన్ని సదుపాయాలూ కల్పించబడ్డాయని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యాలయాలలో, పని ప్రదేశాలలో ఇబ్బందులు ఎదురైతే ఉన్నతాధికారుల దృష్టికి తేవాలని, మహిళల భద్రత విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో టీఎన్జీవో కేంద్ర సంఘం అధ్యక్షుడు మారం జగదీశ్, కార్యదర్శి ఎం.నాగరాజు, జిల్లా సంఘం అధ్యక్షుడు అలుక కిషన్, కార్యదర్శి శేఖర్, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ప్రతిమరాజ్, డీడబ్ల్యుఓ రసూల్ బీ, జిల్లా సాంఘీక సంక్షేమ అభివృద్ధి అధికారిణి శశికళ, మహిళా ఉద్యోగులు, టీఎన్జీవోల సంఘం ప్రతినిధులు, వివిధ శాఖల ఉద్యోగులు పాల్గొన్నారు.

# ఆర్కిడ్స్ పాఠశాలలో ఘనంగా "ఇంగ్లీష్ ఫేర్"




**వేగుచుక్క న్యూస్, కామారెడ్డి, మార్చి 22:**

పట్టణంలోని ఆర్కిడ్స్ పాఠశాలలో ఇంగ్లీష్ ఫేర్ కార్యక్రమాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థిని, విద్యార్థులు సాంప్రదాయ దుస్తులతో పాటుగా వివిధ రకాల జంతువుల వేషధారణలలో అందరిని అబ్బురపరిచారు. ఈ కార్యక్రమంలో సుమారుగా 30 రకాల ఇంగ్లీష్ కమ్యూనికేషన్ స్కిల్స్ ప్రదర్శనలు ఇచ్చారు. ఈ ప్రదర్శనలు ఆర్కిడ్స్ బ్యాంక్, ఆర్కిడ్స్ సూపర్ మార్కెట్, ఆర్కిడ్స్ రేడియో, ఆర్కిడ్స్ ఫారెస్ట్ వీటితో పాటుగా యూనిటి ఆఫ్ స్ట్రెంత్, ది ఫాక్స్ అండ్ ది గ్రేప్స్, హేర్ అండ్ టాటయిస్, గొల్డిలాక్స్ అండ్ త్రి బియర్స్ వంటి స్కిట్లలో విద్యార్థులు ప్రదర్శనలు ఇచ్చారు. ఈ సందర్భంగా పాఠశాల చైర్మన్, ప్రిన్సిపాల్ సిహెచ్. గోవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ, విద్యార్థుల్లో ఇంగ్లీష్ లో నైపుణ్యం పెంచుకోవడానికి ఈ ఇంగ్లీష్ ఫేర్ ఎంతగానో యోగపడుతుందని అన్నారు. విద్యార్థులకు తరగతిలో చదువుతో పాటుగా నిజ జీవితంలో ఇలాంటి కార్యక్రమాలు ఎంతగానో ఉపయోగపడుతాయని అన్నారు. గత సంవత్సరం నుండి ప్రతిసంవత్సరం ఇలాంటి ఇంగ్లీష్ ఫేర్ నిర్వహించడం వలన విద్యార్థుల్లో ఇంగ్లీష్ భాషలో మెలకువలు నేర్చుకోవడంతో పాటు భాష పై పట్టు సాధిస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో కార్మతమంది పాఠశాల ప్రిన్స్ పాల్ గోవర్ధన్ రెడ్డి తో పాటు, ఆర్కే గ్రూప్ సిఇఓ జైపాల్ రెడ్డి, రిటైర్ట్ ఎంపీడీవో విఠల్ రావు, డైరెక్టర్ సదాశివ రెడ్డి, ఉపాధ్యాయ బృంధం, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు,















